## భద్రతా సూత్రాలను పాటించాలి



బహుమతులు అందజేస్తున్న ఏరియా జీఎం జాన్ ఆనంద్

ఇల్లెందు రూరల్, అక్టోబర్ 27: కార్మికులు భద్రతా సూత్రాలను పాటించాలని సింగరేణి ఇల్లెందు ఏరియా జీఎం జాన్ ఆనంద్ అన్నారు. జేకే 5 ఉపరితల గనిలో శుక్రవారం తనిఖీ బృందం కన్వీనర్, జీఎం(ఎడ్యుకేషన్) ఎన్.వెంకటేశ్వరరావు, జీఎం(సేఫ్టీ రీజియన్) జి.కుమారస్వామితో కలిసి 54వ వార్షిక పక్షోత్సవాలను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. భద్రతా సూత్రాలను ఎప్పటికప్పుడు పాటిస్తూ రక్షణతో కూడిన ఉత్పత్తిని సాధించాలన్నారు. కార్మికుల శ్రేయస్సు కోసమే పక్షోత్సవాలను నిర్వహిస్తున్నామన్నారు. గనిలోని అన్ని విభాగాలను తనిఖీ చేశారు. ఉత్తమ ఉద్యోగులకు, వివిధ రకాల పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో తనిఖీ బృందం సభ్యులు రాజమల్లు, శంకర్‌రావు, బాలాజీనాయుడు, పోశమల్లు, సుదర్శన్, కృష్ణమోహన్, సదానందం, బొల్లం వెంకటేశ్వర్లు, పి.శ్రీనివాసు, పూర్ణచందర్, శివప్రసాద్, చిన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

**జీఎం వర్క్‌షాప్, సోలార్ ప్లాంట్‌లో..**



బహుమతి అందిస్తున్న దామోదర్ రావు

జీఎం వర్క్‌షాప్, సోలార్ పవర్ ప్లాంట్‌లో పక్షోత్సవాలను ఇల్లెందు ఏరియా జీఎం జాన్ ఆనంద్‌తో కలిసి తనిఖీ బృందం కన్వీనర్ ఎన్.దామోదర్‌రావు ప్రారంభించారు. ఉత్తమ ఉద్యోగులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో తనిఖీ బృందం సభ్యులు రాజీవ్‌కుమార్, చంద్రలింగం, శ్యామ్ ప్రసాద్, శ్రీనివాసు, నరసింహరాజు, విజయ్ శేఖర్‌బాబు, వీరునాయక్ తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికల వ్యయ అంశాలను రికార్డు చేయాలి



మాట్లాడుతున్న వ్యయ నియంత్రణ నోడల్ అధికారి

కొత్తగూడెం టౌన్, అక్టోబర్ 27: ఎన్నికల ప్రక్రియలో వ్యయానికి సంబంధించిన ప్రతి అంశాన్ని రికార్డు చేయాలని వ్యయ నోడల్ అధికారి, సహకార అధికారి వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం ఐడీవోసీ కార్యాలయం సమావేశ మందిరంలో సహాయ వ్యయ పరిశీలన అధికారులు, అకౌంట్స్, వీడియో సర్వైలెన్స్, వీడియో వ్యూయింగ్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఆయా నియోజకవర్గ రిటర్నింగ్ అధికారులు ద్వారా రాజకీయ పార్టీలు నిర్వహించే సభలు, సమావేశాలు, ర్యాలీల వివరాలు తీసుకొని వీడియో రికార్డింగ్ చేయాలని చెప్పారు. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులకు ఎన్నికల సంఘం రూ.40 లక్షల వరకు సీలింగ్ విధించిందని, ప్రతి పైసా లెక్కింపు జరగాలని చెప్పారు. సమావేశంలో వ్యయ నియంత్రణ కో ఆర్డినేటింగ్ అధికారి వెంకటేశ్వర్‌రెడ్డి, మాస్టర్ ట్రైనీ నోడల్ అధికారి శ్రీనివాసరావు, ఎంసీఎంసీ నోడల్ అధికారి శ్రీనివాసరావు, సహాయ వ్యయ పరిశీలన అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## సీజ్ వాహనాలకు ఆర్నెల్లే గడువు

కొత్తగూడెం క్రైం, అక్టోబర్ 27: పోలీస్‌శాఖలో వివిధ కేసుల్లో సీజ్ చేసిన ద్విచక్ర వాహనాలు, కార్లను త్వరితగతిన యజమానులు సరైన పత్రాలు సమర్పించి విడుదల చేసుకోవాలని జిల్లా మోటార్ వెహికల్ ట్రాన్స్‌పోర్ట్ ఆఫీసర్(ఎంటీవో) సుధాకర్ తెలిపారు. వివిధ పోలీస్‌స్టేషన్ల పరిధిలో వివిధ కేసుల్లో పట్టుబడి సీజ్ అయిన అన్‌క్లెయిమ్డ్ వాహనాలు మొత్తం 324 ఉన్నాయని తెలిపారు. ఆరునెలల గడువులోపు జిల్లా ఎంటీవో కార్యాలయంలో సరైన పత్రాలు సమర్పించి విడిపించకపోతే కాలం చెల్లిన వాహనాలను స్క్రాప్‌కి, సామర్థ్యం ఉన్న వాహనాలకు వేలంపాట నిర్వహిస్తామని పేర్కొన్నారు. వాహనాల జాబితాను ట్విట్టర్, ఫేస్‌బుక్ ఖాతాల్లో పొందుపరుస్తామన్నారు.

## బొజ్జాయిగూడెంలో కేసీఆర్ సభకు

# భారీగా జన సమీకరణ

ఇల్లెందు రూరల్, అక్టోబర్ 27: మండలంలోని బొజ్జాయిగూడెంలో నవంబర్ 1న జరుగనున్న సీఎం కేసీఆర్ సభకు జనాలను భారీగా సమీకరించనున్నట్లు బీఆర్ఎస్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శీలం రమేశ్, ఖమ్మంపాటి రేణుక చెప్పారు. సభను విజయవంతం చేయాలని కోరుతూ మండలంలోని బొజ్జాయిగూడెం, కొమరారం, పోలారం తదితర గ్రామాల్లో వారు శుక్రవారం విస్తృతంగా ప్రచారం చేశారు. నవంబర్ 1న మధ్యాహ్నం 2.00 గంటలకు సీఎం సభ ప్రారంభమవుతుందన్నారు. సభకు వచ్చే ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణలో మోసపోయే పార్టీలకు ఓటు వేసి గోస పడొద్దని, బీఆర్ఎస్‌ను మరోసారి గెలిపించాలని ప్రజలను కోరారు. వైస్ ఎంపీపీ దాస్యం ప్రమోద్ తదితరులు పాల్గొన్నారు.



ఇల్లెందు రూరల్: జన సమీకరణపై నాయకులతో చర్చిస్తున్న రేణుక

**హరిప్రియ గెలుపునకు సైనికుల్లా పనిచేద్దాం**

ఇల్లెందు రూరల్, అక్టోబర్ 27: అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే బానోత్ హరిప్రియానాయక్ గెలుపునకు సైనికుల్లా పనిచేద్దామని ముఖ్య నాయకులు, కార్యకర్తలకు పార్టీ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శీలం రమేశ్, ఖమ్మంపాటి రేణుక పిలుపునిచ్చారు. మండలంలోని అన్ని పంచాయతీల్లో శుక్రవారం ఇంటింటి ప్రచారం నిర్వహించి, ముఖ్య నాయకులు-కార్యకర్తలతో సమావేశమయ్యారు. హరిప్రియ గెలుపునకు అనుసరించాల్సిన వ్యూహంపై చర్చించారు. వారు మాట్లాడుతూ.. ప్రభుత్వ సంక్షేమ పథకాలను, చేసిన అభివృద్ధిని, మేనిఫెస్టోలోని అంశాలను ఇంటింటికీ వెళ్లి వివరించాలని కోరారు. ప్రత్యర్థుల విమర్శలను తిప్పికొట్టేలా ఎన్నికల ప్రచారం ఉధృతంగా సాగించాలన్నారు. ఎమ్మెల్యేగా నియోజకవర్గానికి హరిప్రియ చేసిన అభివృద్ధిని ప్రజలకు ప్రధానంగా వివరించాలని చెప్పారు.



బయ్యారం: మాట్లాడుతున్న జడ్పీ చైర్‌పర్సన్ బిందు

ఇల్లెందు రూరల్, అక్టోబర్ 27: సీఎం కేసీఆర్ ప్రజాశీర్వాద సభకు యువతను సమీకరిస్తున్నట్లు బీఆర్ఎస్ యువజన విభాగం మండల అధ్యక్షుడు నీలం రాజశేఖర్ చెప్పారు. ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడారు.

ఇల్లెందు, అక్టోబర్ 27: రైతు బంధు సహాయాన్ని ఆపాలని కేంద్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేసిన కాంగ్రెస్ పార్టీ నాయకులకు రానున్న ఎన్నికల్లో రైతులే బుద్ధి చెబుతారని బీఆర్ఎస్ ఇల్లెందు పట్టణ అధ్యక్షుడు నాదెండ్ల శ్రీనివాసరెడ్డి అన్నారు. ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడారు.

**నేడు టేకులపల్లి మండలంలో హరిప్రియ ప్రచారం**

టేకులపల్లి, అక్టోబర్ 27: బీఆర్ఎస్ ఇల్లెందు అభ్యర్థి, ఎమ్మెల్యే బానోత్ హరిప్రియానాయక్ శనివారం మండలంలో విస్తృతంగా పర్యటిస్తారు. గంగారం పంచాయతీలో ఉదయం 7.30 గంటలకు ప్రచారం ప్రారంభిస్తారు. అక్కడి నుంచి చింతోనిచెలక, మెళ్ళమడుగు, కిష్టారం, లచ్చగూడెం, కొప్పురాయి, బర్లగూడెం గ్రామాల్లో ఇంటింటి ప్రచారం చేస్తారు.

**సభను విజయవంతం చేయాలి**

బయ్యారం, అక్టోబర్ 27: నవంబర్ 1న బొజ్జాయిగూడెంలో జరగనున్న సీఎం ప్రజాశీర్వాద సభను బీఆర్ఎస్ శ్రేణులు విజయవంతం చేయాలని మహబూబాబాద్ జడ్పీ చైర్‌పర్సన్ అంగోత్ బిందు పిలుపునిచ్చారు. సభకు జన సమీకరణపై శుక్రవారం ఆమె బయ్యారంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో స్థానిక నేతలతో చర్చించారు. మండలంలోని 29 పంచాయతీల నుంచి 10వేల మందిని తరలించాలన్నారు. సీఎం కేసీఆర్ సహకారంలో నియోజక వర్గం అభివృద్ధయిందని, దీనికి కృతజ్ఞతగా ప్రతి ఇంటి నుంచి కనీసం ఒక్కరినైనా తరలించాలని అన్నారు. ప్రజాప్రతినిధులు-నాయకులు బానోత్ హరిసింగ్ నాయక్, తతా గణేష్, దిండిగల రాజేందర్, మూల మధుకర్ రెడ్డి, అంగోత్ శ్రీకాంత్ నాయక్, గంగుల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## ‘ఇల్లెందు’ను అభివృద్ధి చేశా..

# ఆశీర్వదించండి

**బీఆర్ఎస్ అభ్యర్థి హరిప్రియ**



మహిళలతో కలిసి కోలాటం వేస్తున్న బానోత్ హరిప్రియ

కారేపల్లి, అక్టోబర్ 27: ‘‘గడిచిన ఐదేళ్లలో ఇల్లెందు నియోజకవర్గాన్ని కనీవినీ ఎరుగని రీతిలో అభివృద్ధి చేశాను. ఈ ఎన్నికల్లోనూ నన్ను మరోసారి ఆశీర్వదించండి’’ అని ప్రజలను బీఆర్ఎస్ ఇల్లెందు అభ్యర్థి, ఎమ్మెల్యే బానోత్ హరిప్రియానాయక్ అభ్యర్థించారు. కామేపల్లి మండలంలోని మద్దులపల్లి, లాల్యాతండా, జగన్నాథ తండా, బాసిత్‌నగర్, సాతానిగూడెం పంచాయతీల్లో శుక్రవారం స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు,కార్యకర్తలతో కలిసి విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ.. ఎన్నో దశాబ్దాలుగా వెనుకబాటుకు గురైన ఇల్లెందు నియోజకవర్గాన్ని కేవలం నాలుగేండ్లలో ఎంతగానో అభివృద్ధి చేసినట్లు చెప్పారు. గ్రామాలన్నీ సీసీ రోడ్లతో మెరిసిపోతున్నాయని అన్నారు. ఉమ్మడి రాష్ట్ర పాలనలో అభివృద్ధి లో ఆమడ దూరంలో ఉన్న ఇల్లెందు నియోజకవర్గాన్ని సీఎం కేసీఆర్ ఆశీర్వాదంతో అభివృద్ధిలో ఆదర్శవంతంగా తీర్చిదిద్దానని అన్నారు. మరింత అభివృద్ధి సాధించేందుకు కారు గుర్తుకు ఓటు వేసి బీఆర్ఎస్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. బీఆర్ఎస్ మేనిఫెస్టోలోని అంశాలను ఇంటింటికీ వెళ్లి వివరించారు.

## బెల్ట్ షాపుదారుల బైండోవర్

టేకులపల్లి, అక్టోబర్ 27: మండలవ్యాప్తంగా 50 బెల్ట్ షాపుదారులను ఇల్లెందు ఎక్సైజ్ సీఐ రాంప్రసాద్ ఆధ్వర్యంలో ఎస్సైలు రమాదేవి, సమీవుల్లాఖాన్ శుక్రవారం తహసీల్దార్ కొండపల్లి కృష్ణవేణి వద్ద ముందస్తుగా బైండోవర్ చేశారు. బెల్ట్ షాపు దారులతో తహసీల్దార్ మాట్లాడుతూ.. ఎన్నికల కోడ్‌కు విరుద్ధంగా బెల్ట్ షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.



బెల్ట్‌షాపుదారులతో మాట్లాడుతున్న తహసీల్దార్ కృష్ణవేణి

## బీజేపీ పాలనలో దళితులపై దాడులు

కొత్తగూడెం అర్బన్, అక్టోబర్ 27 : బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత దళితులపై దాడులు పెరిగాయని, మనువాదాన్ని పెంచడం కోసం ఆర్ఎస్ఎస్, బీజేపీ కలిసి పనిచేస్తున్నాయని వ్యవసాయ కార్మిక సంఘం కేంద్ర కమిటీ సభ్యుడు మచ్చా వెంకటేశ్వర్లు, దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు బందెల నర్సయ్య విమర్శించారు. శుక్రవారం మంచికంటిభవన్‌లో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో వారు మాట్లాడారు. రాజ్యాంగ పరిరక్షణ కోసం డిసెంబర్ 4న చేపట్టనున్న చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఆయా సంఘాల నాయకులు రేపాకుల శ్రీనివాస్, సలిగంటి శ్రీనివాస్, అన్నవరపు కనకయ్య, రత్నకుమారి, రమేష్, నాగేశ్వరరావు, చిరంజీవి, ధనలక్ష్మి, భూపేష్, విజయలక్ష్మి, బాలకృష్ణ, రాములు పాల్గొన్నారు.